విద్యార్థులు ఉన్నత లక్ష్యం పెట్టుకోవాలి

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వర రావు

బన్సీలాల్‌పేట్, జూలై 18 : విద్యార్థులకు ఉన్నతమైన లక్ష్యాలు ఉండాలి, ఎన్ని అడ్డంకులు ఎదురైనా లక్ష్యాన్ని వదలకూడదని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వర రావు అన్నారు. పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాలలో నూతన విద్యార్థులకు గురువారం వ్యక్తిత్వ వికాస శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయం విలువ తెలుసుకోవాలని, జీవితంలో మళ్ళీ తిరిగిరాని కళాశాల జీవితాన్ని సరదాగా ఎంజాయ్ చేయాలన్నారు. వ్యక్తిగత క్రమశిక్షణ, గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల దైవభక్తి, స్వీయ నియంత్రణలో ఉంటూ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. హేమలత, వైస్ ప్రిన్సిపాల్ అమర్నాథ్ శర్మ, పరిపాలనాధికారి రాహుల్ యాదవ్‌లు పాల్గొన్నారు.

భారత బృందానికి శుభాకాంక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 18: అత్యంత ప్రతిష్టాత్మకమైన ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న భారత బృందానికి నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 26న పారిస్‌లో జరుగనున్న ఈ క్రీడా పోటీల్లో దేశం తరపున 117 మంది క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. ఈ క్రీడల్లో భారత్ తరపున విజయాలు సాధించి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. నూతన విజయాలను సాధించి చరిత్ర తిరగరాయాలని కోరారు.

మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలి

వన మహోత్సవంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

కాలనీ అధ్యక్షులు విజయ్‌సింగ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీరెడ్డితో కలిసి మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట్, జూలై 18 : భూమి మీద పచ్చదనం కనుమరుగవుతున్న నేపథ్యంలో పర్యావరణ సమతుల్యం లోపిస్తున్నదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా స్వీకరిస్తే అది భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించేందుకు వీలవుతుందన్నారు. గురువారం సనత్‌నగర్ డివిజన్ బీకేగూడ రవీంద్రనగర్‌లోజరిగిన వన మహోత్సవంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయ్‌సింగ్‌లతో కలిసి పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రవీంద్రనగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి అధ్యక్షులు విజయ్‌సింగ్ సహా కాలనీ నివాసితులు చూపిన చొరవను ప్రత్యేకంగా అభినందించారు. అయితే గతంలో తాను మంజూరు చేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు లేవంటూ సాకు చూపుతూ పక్కన పెట్టడం దివాళాకోరు విధానమన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ ఇందిర, డీఈ మోహన్, జలమండలి ఈఈ హరిశంకర్, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, దాడి ప్రవీణ్‌రెడ్డి, పుట్టల శేఖర్, పుష్పలత, సనీతగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి సమస్యను వివరిస్తున్న నల్లగుట్ట జీహెచ్‌ఎంసీ దుకాణదారులు

అద్దెలు పెంచొద్దు

బేగంపేట్: అద్దెలను పెంచి చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయవద్దని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని నల్లగుట్ట మార్కెట్‌లో గల జీహెచ్‌ఎంసీకి చెందిన దుకాణాలలో వివిధ వ్యాపారాలు చేసుకుంటున్న పలువురు చిరు వ్యాపారులు ఎమ్మెల్యేను మారేడ్‌పల్లిలోని నివాసం వద్ద కలిసి వారు తమ గోడును విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ త్వరలోనే జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

యాదాద్రి వైభవం-2 పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, జూలై 18 : గీతా ఫౌండేషన్, లక్ష్య సాధన ఫౌండేషన్, నక్కా వెంకటమ్మయాదవ్, నక్కా యాదగిరి స్వామి ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో యాదాద్రి వైభవం-2 పుసకావిష్కరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా విజయలక్ష్మి ఆలయ ప్రధాన అర్చకులు గట్టు అరుంధతి రంగాచార్యులు, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, బీసీ పొలిటికల్ జేఏసీ రాచాల యుగంధర్‌గౌడ్, గంటా మనోహర్‌రెడ్డి విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించి పలువురు కవులు, కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు ,ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

బొల్లారం,జూలై 18: కంటోన్మెంట్ బొల్లారం రిసాల బజార్ ప్రభుత్వ పాఠశాలలో బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజు సిబ్బందితో కలిసి గురువారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు,రోడ్డు ప్రమాదాల నివారణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలతో పాటు రోడ్డు భద్రతా నియమాల గూర్చి బోధనాంశాలలో చేర్చాలని సూచించారు. రోడ్డు దాటేటప్పుడు జీబ్రా లైన్,పుట్‌పాత్‌ల వద్ద మాత్రమే రోడ్డు దాటాలని తెలిపారు. తల్లిదండ్రులు వాహనంపై వెళ్తున్నప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ మాట..అంగన్‌వాడి బాట

భోలక్‌పూర్‌లో అంగన్‌వాడి బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు

బన్సీలాల్‌పేట్, జూలై 18 : భోలక్‌పూర్‌లో గురువారం అమ్మ మాట అంగన్‌వాడి బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్లు విజయరాణి, అనిత, సావిత్రి, స్వర్ణలత, సునీతలు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ రెండున్నర ఏండ్ల నుంచి ఐదేండ్ల లోపు చిన్నారులను వేల రూపాయల ఫీజులు కట్టి ప్రైవేట్ స్కూళ్ళలో నర్సరీలను పంపవద్దని, సమీపంలోని అంగన్‌వాడి కేంద్రాలలో చేర్పించాలని అన్నారు. ప్రతిరోజూ అక్కడ వారికి పూర్వ ప్రాథమిక విద్య నేర్పిస్తామని, పోషకాహారంతో పాటు మంచి అలవాట్ల గురించి వివరిస్తామన్నారు. ఇంటింటికీ వెళ్లి అంగన్‌వాడిలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బొల్లారం ఓం సాయి కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

బొల్లారం,జూలై 18: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. గురువారం కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు పరిధిలోని బొల్లారం ఓం సాయి కాలనీలో పర్యటించారు.ఈ మేరకు కాలనీ వాసులు వీధి దీపాలు,అపరిశుభ్రత కారణంగా ఇంట్లోకి పాములు వస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ సిబ్బంది,కంటోన్మెంట్ బోర్డు అధికారులతో కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.అనంతరం సాయిబాబా మందిరంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు,సీనియర్ నాయకులు తేజ్‌పాల్,సదానంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ సందర్శన

బొల్లారంలోని చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించి పిల్లలకు స్వీట్లు తినిపించి సరదాగా గడిపారు.డెవలప్‌మెంట్ సెంటర్‌కు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలోని ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు. -ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 18

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమం

చిక్కడపల్లి, జూలై 18 : బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమం చేపడుతున్నట్లు నేషనల్ పోలిటికల్ జస్టిస్ ఫ్రంట్(ఎన్‌పీజేఎఫ్) చైర్మన్ వీజీఆర్ నారగోని అన్నారు. గురువారం అశోక్‌నగర్‌లోని నేషనల్ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలన అంతా ఒకే సామాజిక వర్గం చేతిలోకి వెళ్లిందన్నారు. అన్ని రంగాల్లో బీసీలను అణిచివేయడం జరుగుతోందని, ఇటీవలే కార్పొరేషన్ చైర్మన్ల నియామకాల్లో కూడా బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతున్న రాహుల్ గాంధీ రాజ్యాంగంలోని ఏ ఒక్క అంశాన్ని కూడా కాంగ్రెస్ పార్టీలో అమలు చేసే స్థితిలో లేదన్నారు.

పీజీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

-కళాశాల గేటు ఎదుట ఏబీవీపీ నాయకులు, విద్యార్థుల ధర్నా అదుపులోకి తీసుకున్న పోలీసులు

సికింద్రాబాద్ పీజీ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

మారేడ్‌పల్లి, జూలై 18: సికింద్రాబాద్ పీజీ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ...అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్ పీజీ కళాశాల గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్క బాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ చెర్క బాలు మాట్లాడుతూ...పీజీ కళాశాలలో పలు సమస్యలతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతుంటే ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.ముఖ్యంగా కళాశాల మైదానం, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులను దోమల బెడదల నుంచి రక్షించాలన్నారు. అదేవిధంగా సెల్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజేషన్ చేయాలని, జిమ్‌ని అన్ని వసతులతో పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కోసం 24/7 వైద్య సేవలు అందుటలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, ప్రతి నెల మెస్ బిల్లులను నోటీసు బోర్డులో పెట్టి, అధిక బిల్లుల పై చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థి నాయకులు, పోలీసుల మధ్య తోపులాట..

కళాశాల ముందు ఏబీవీపీ నాయకులు విద్యార్థులతో కలిసి ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు శాంతి యుతంగా ధర్నా చేస్తున్నామని తమకు సహకరించాలని పోలీసులను కోరారు. దీంతో పోలీసులు ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకుడు చెర్క బాలుతో పాటు పలువురిని అదుపులోకి తీసుకొని సమయంలో తీవ్ర ఉద్రిత్తత పరిస్థితి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాండు రంగ్, రమేష్, సాయిరాం, సంతోష్, మౌనిక, స్వప్న, నీరజ, మనిషా, వసంత తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ముందు ధర్నా చేస్తున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చెర్క బాలును బలవంతంగా పోలీసు వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత

రెజిమెంటల్‌బజార్‌లోని శ్రీ గండి మైసమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 21, 22న జరిగే బోనాల ఉత్సవాలకు రావాలంటూ ఆహ్వాన పత్రికను గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు ఆలయ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు అల్లాడి గౌరీశంకర్, నందికంటి రవి, శ్రీనివాస్‌లు అందజేశారు. – మారేడ్‌పల్లి, జూలై 18

సాయిబాబా ఆలయంలో సామూహిక వ్రతాలు

సామూహిక శ్రీసాయి వ్రతాలలో పాల్గొన్న భక్తులు

బన్సీలాల్‌పేట్, జూలై 18 : పద్మారావునగర్‌లోని డాక్టర్ సాయికుమార్ వ్యాధి నివారణ ఆశ్రమంలో శ్రీసాయి సప్తాహ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురుపౌర్ణమి సందర్భంగా ఏడు రోజుల పాటు ఆశ్రమ ఆవరణలో ఉన్న శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం శ్రీసాయి సామూహిక వ్రతాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిరిడిలో సాయిబాబా మహాసమాధి పొందిన అనంతరం జరిగిన లీలలను ఆలయ పండితులు చక్కగా వివరించారు. ఉదయం సాయిబాబా విగ్రహానికి శ్రీ సాయి స్వర్ణాభిషేకం నిర్వహించారు.

ఉజ్జయినీ బోనాలకు ముమ్మర ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలించిన దేవాదాయశాఖ, పోలీస్‌శాఖ అధికారులు

ఏర్పాట్లు పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తదితరులు

దేవాలయం వద్ద బందోబస్తు వివరాలు తెలుసుకుంటున్న ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

బేగంపేట్, జూలై 18: ఈ నెల 21,22న జరగనున్న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరను పురస్కరించుకొని దేవాదాయశాఖ అధికారులు భక్తుల కోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించే మహిళలు, అలాగే దర్శనం కోసం వచ్చే భక్తులకు క్యూలైన్‌లలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలను కల్పించే దిశగా అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే దేవాలయం చుట్టూ ఆర్‌అండ్‌బీ అధికారులు భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనమంతరావు గురువారం దేవాలయ ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లపై ఈవో గుత్తా మనోహర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

భద్రతా విషయాలపై డీసీపీ సాధనరష్మీ పెరుమాల్ ఆరా

ఉజ్జయినీ మహంకాళి దేవాలయంతో పాటు జాతర ఉత్సవాలు జరిగే అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ఉత్తర మండలం పోలీసులు వారం రోజులుగా నిత్యం పరిసరాలను పరిశీలిస్తున్నారు. ఈక్రమంలో మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతర జరిగే ప్రాంతాలు, భక్తులు దేవాలయానికి వచ్చే దారులను మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశరాంతో కలిసి డీసీపీ సాధన రష్మీ పెరుమాల్ సందర్శించారు. ఆలయానికి వచ్చే రహదారులు, అంతర్గత రహదారుల్లో భద్రత విషయాలను అడిగి తెలుసుకున్నారు.

మహంకాళి దేవాలయంలో చండీహోమం

ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో చండీహోమం నిర్వహించారు. ప్రధానర్చకులు రామతీర్థశర్మ, వేదపండితులు వేణుమాధవశర్మలు భక్తి శ్రద్ధలతో ఈ హోమాన్ని నిర్వహించారు.ఈ హోమంలో ఈవో గుత్తా మనోహర్‌రెడ్డితో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఓపెన్ జిమ్ పనులు పరిశీలన

టీఆర్టీ క్వార్టర్స్‌లో ఓపెన్ జిమ్ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్,జూలై18: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేటర్ సామల హేమ అన్నారు.గురువారం డివిజన్ పరిధిలోని టీఆర్టీ క్వాటర్స్‌లోని పార్క్‌లో జరుగుతున్న ఓపెన్ జిమ్ పనులను కార్పొరేటర్ హేమ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే పార్క్ అభివృద్ధి పనుల తీరును జీహెచ్‌ఎంసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ఓపెన్ జిమ్‌లను రూ.70 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు.

టీజీపీసీబీలో బోనాలు

టీజీపీసీబీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం ఆషాఢ మాస బోనాలు ఘనంగా జరిగాయి. టీజీపీసీబీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు మధుగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రధాన కార్యాలయం ఆవరణలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఔట్ సోర్సింగ్ మహిళలు సంప్రదాయ పద్ధతిలో బోనాలు సమర్పించారు. ఉద్యోగులు పెద్దసంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. – అమీర్‌పేట్, జూలై 18

ఆర్మీ జవాన్లకు రాఖీలు పంపిణీ

బేగంపేట్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే పద్మావతి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు సంయుక్తంగా కలిసి గురువారం కళాశాల ప్రాంగణంలో 78 రాఖీలను సంస్కృతి ఫౌండేషన్ వారికి అందజేశారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకోని దేశ సరిహద్దులలో విధులు నిర్వహించే ఆర్మీ జవాన్‌లకు ఈ రాఖీలను సోదర,సోదరి భావంతో పంపించడం జరిగిందని ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. -బేగంపేట్

హోరాహోరీగా మాన్‌సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ వేదికగా 15వ మాన్‌సూన్ రెగెట్టా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీల నాలుగో రోజు గురువారం అన్ని విభాగాల్లో రెండేసి రౌండ్ల రేసులు నిర్వహించారు. బాలుర ఐఎల్‌సీ-4 విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఏకలవ్య బాతం అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇదే కేటగిరీలో అక్షత్(మధ్యప్రదేశ్), కృష్ణదివాకర్(మైసూర్) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. మరోవైపు అండర్-16 అప్టిమిస్ట్ ఫ్లీట్ విభాగంలో తెలంగాణకు చెందిన గోవర్ధన్ టాప్‌లో కొనసాగుతున్నాడు. 8,9 రౌండ్ రేసుల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన గోవర్ధన్ పసిడి పతకం దిశగా దూసుకెళుతున్నాడు. రాష్ట్రానికే చెందిన దీక్షిత 9వ రేసులో 14వ స్థానం నుంచి దూసుకొచ్చి ఆశ్చర్యపరిచింది. అండర్-18 అంతర్జాతీయ 420 మిక్స్‌డ్ డబుల్స్‌లో వైష్ణవి, శ్రవణ్, తనూజ, గణేశ్ జోడీలు తొలి రెండు స్థానాలను నిలబెట్టుకున్నాయి.

సాంస్కృతిక వారసత్వం..

సాంస్కృతిక వారస్వత్వాన్ని కొనసాగిస్తూ అమీర్‌పేట్ కుమ్మరి బస్తీలోని అనేక కుటుంబాలు ఇప్పటికీ తమ కులవృత్తిని కొనసాగిస్తుండడం అభినందనీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ కోటా నీలిమ పేర్కొన్నారు. ఈ నెల 21న జరిగే సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారికి సమర్పించే బోనాలకు చక్కటి రంగులతో సిద్ధం చేసిన కుండలను డాక్టర్ కోటా నీలిమ పరిశీలించారు. సంప్రదాయ రంగులతో అమీర్‌పేట్ కుమ్మరిబస్తీ వాసులు నగేష్, శ్యామల దంపతులు రూపొందించిన కుండల్లోనే అమ్మవారికి బోనం సమర్పిస్తానని డాక్టర్ కోట నీలిమ తెలిపారు.– అమీర్‌పేట్, జూలై 18